క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో జులై 1న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కొండా మురళి గెస్ట్ హౌజ్ రోడ్డు, జవహర్ కాలనీ, ఉషోదయ కాలనీ, ఎస్వీఎస్ హోమ్స్, విష్ణుపురి కాలనీ, ద్వారకాసాయి కాలనీ, నవయుగ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అరుణ కీర్తికి గజల్ పురస్కారం



హన్మకొండ అర్బన్: నగరానికి చెందిన కవి, రచయిత, గజల్ గాయని గంకిడి అరుణ కీర్తికి గజల్ జాతీయ పురస్కారం అందజేశారు. విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ గజల్ సాహితీ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్, భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 29న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ విజయలక్ష్మి పండిట్, డాక్టర్ బిక్కి కృష్ణ నుంచి పురస్కారాన్ని అరుణ కీర్తి స్వీకరించారు.

కేయూ సోషల్‌సైన్స్ డీన్‌గా ప్రొఫెసర్ సురేష్‌లాల్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ సోషల్‌సైన్స్ డీన్‌గా ఎకనామిక్స్ విభాగం ప్రొఫెసర్ సురేష్‌లాల్ నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం సోమవారం ఉత్తర్వులు జారీచేయగా వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి అందజేశారు. ఇప్పటి వరకు సోషల్ సైన్స్‌డీన్‌గా, ఆర్ట్స్ విభాగం ఇన్‌చార్జ్ డీన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న హిస్టరీ విభాగం ప్రొఫెసర్ మనోహర్ పదవీకాలం పూర్తికావటంతో ఆయన స్థానంలో సురేష్‌లాల్‌ను నియమించారు.

కేయూ ఇంగ్లిష్ విభాగం అధిపతిగా మేఘనరావు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లిష్ విభాగం అధిపతిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మేఘనరావు నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు ఆ విభాగం అధిపతిగా డాక్టర్ దీపాజ్యోతి బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె పదవీకాలం పూర్తికావడంతో మేఘనరావును నియమించారు.

ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ సీనియర్ కేడెట్‌కు అభినందన



కేయూ క్యాంపస్: దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అటాచ్‌మెంట్ క్యాంపులో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ సీనియర్ కేడెట్ అరవింద్ పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు కళాశాలలో అరవింద్‌ను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, అధ్యాపకులు సోమవారం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి ఫ్లయింగ్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మిట్టపల్లి భాస్కర్‌కు సన్మానం



హన్మకొండ కల్చరల్: లష్కర్‌బజార్ రామమందిర్, గోవిందరాజుల గుట్ట, వేణుగోపాలస్వామి దేవాలయాల్లో కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వర్తించిన మిట్టపల్లి భాస్కర్ పదవీ విరమణ కార్యక్రమం వరంగల్ జోన్ దేవాదాయ శాఖ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తనుగుల రత్నాకర్, డీసీ ఆఫీస్ సూపరింటెండెంట్ గౌరీశంకర్, డీఈ రమేష్, వేణుగోపాలస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఇరుకుల రమేష్, డివిజన్ పరిశీలకుడు అనిల్‌కుమార్, తదితరులు భాస్కర్‌ను సన్మానించారు.

పార్ట్‌టైం లెక్చరర్ల ఆందోళన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పార్ట్‌టైం లెక్చరర్లు పరిపాలన భవనం వద్ద ఆందోళనకు సోమవారం దిగారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాకే అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజం



పదవీ విరమణ పొందిన ఉద్యోగులతో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, తదితరులు



వరంగల్ క్రైం: పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులు, సిబ్బందితో పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



కాజీపేట అర్బన్: కృష్ణమూర్తిని సన్మానిస్తున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాభవాని, సిబ్బంది

వరంగల్ అర్బన్: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో 10 మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందగా, జేఏసీ ఆధ్వర్యంలో వారిని మేయర్‌తో పాటు కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, జేఏసీ నాయకులు సోమవారం సాయంత్రం సన్మానించారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఖాజా షరీఫ్ (టీపీబీఓ), ధరమ్ సింగ్ (శానిటరీ ఇన్‌స్పెక్టర్), సీహెచ్.మోహన్ (వార్డు అధికారి), పి.భారతి (అటెండర్), ఎస్.భాస్కర్ (మాలీ), టి.రాజేశ్వర్ రావు, పి.కుమారస్వామి, ఎస్.యశోద, కే.వినోద, కే.యాదమ్మ (పీహెచ్ వర్కర్లు) ఉన్నారు. జేఏసీ ప్రధాన కార్యదర్శి బాకం సంతోష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ సురేష్ జోషి, అడిషనల్ కమిషనర్ జోనా, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, అకౌంట్స్ అధికారి శివలింగం, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, జేఏసీ అధ్యక్షుడు బొట్ల రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు భాస్కర్, గౌరవ అధ్యక్షుడు ధర్మరాజు, ప్రధాన కార్యదర్శి బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

వరంగల్ క్రైం: పదవీ విరమణ అనంతరం పోలీస్ అధికారులు తమ వ్యక్తిగత ఆరోగ్య పట్ల శ్రద్ధ వహిస్తూనే సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. పోలీస్ కమిషనరేట్‌లో దీర్ఘ కాలంపాటు పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఎస్సైలు విద్యాసాగర్, గాలిబ్, సూర్యనారాయణ, పిలిప్ రాజు, యాకూబ్, ఏఎస్సైలు గౌస్ పాషా, నాగేంద్ర సింగ్, సంపత్, శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్‌ను సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సురేష్‌కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తి సేవలు అభినందనీయం

కాజీపేట అర్బన్: హనుమకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో నాలుగు దశాబ్దాల పాటు ఎస్సైగా విధులు నిర్వర్తించిన కృష్ణమూర్తి సేవలు అభినందనీయమని హనుమకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాభవాని కొనియాడారు. పదవీ విరమణ పొందిన ఎస్సై కృష్ణమూర్తిని ఎక్సైజ్ స్టేషన్‌లో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ క్రమశిక్షణ, సమయపాలనకు కృష్ణమూర్తి మారుపేరుగా నిలిచారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎస్సై వెంకన్న, చందు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



కాజీపేట రూరల్: కట్టయ్య దంపతులను సన్మానిస్తున్న రైల్వే అధికారులు, నాయకులు, తదితరులు

రైల్వే సీనియర్ టెక్నీషియన్‌కు సన్మానం

కాజీపేట రూరల్: సీనియర్ టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన మూల కట్టయ్య దంపతులను కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ కాకతీయ కళావేదికలో రైల్వే నాయకులు, తోటి కార్మికులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా కట్టయ్య సేవలను అధికారులు, సూపర్‌వైజర్లు, రైల్వే నాయకులు కొనియాడారు. అనంతరం కట్టయ్య దంపతులకు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు, రైల్వే నాయకులు, కార్మికులు, కట్టయ్య బంధువులు, మిత్రులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతంలో యువత కీలకం

● పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: సోషల్ మీడియా నుంచి బూత్ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడంలో యువత.. కీలక పాత్ర పోషించాలని వరంగల్, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని కోడెం కన్వెన్షన్ హాల్‌లో వరంగల్, హనుమకొండ జిల్లాల యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం సోమవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి మార్గనిర్దేశం చేసే శక్తి యువతలో ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ఇందిరమ్మ ఆశయాలను కొత్తతరం యువతకు పరిచయం చేయాల్సిన బాధ్యత తామందరిపై ఉందని గుర్తుచేశారు. స్థానిక, మున్సిపల్, అసెంబ్లీ స్థాయిలో జరిగే ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం ఇవ్వడమే పార్టీ లక్ష్యమన్నారు. సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కేయూ భూములు కేటాయించొద్దు



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కాకతీయ యూనివర్సిటీ భూములు కేటాయించొద్దని కేయూలోని వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేయూ పరిపాలన భవనం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కేయూ భూమిని కేటాయిస్తూ కేయూ పాలక మండలి ఆమోదించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మర్రి మహేష్, బీఆర్ఎస్వీ కేయూ ఇన్‌చార్జ్ జెట్టి రాజేందర్, పీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జయసూర్య, బీఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షుడు శివ, ఏఐడీఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షుడు మధు, ఎస్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయి పాల్గొన్నారు.

వర్షాలను సమర్థంగా ఎదుర్కొందాం



మాట్లాడుతున్న మేయర్ సుధారాణి, పక్కన కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

వరంగల్ అర్బన్: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సమస్యలను సమష్టిగా, సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేయాలని మేయర్ సుధారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్య విభాగాధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి విపత్తుల నుంచి కాపాడేందుకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. 24 గంటలు సేవలు అందించాలని, ప్రజలకు ఏమైనా సమస్యలు ఎదురైతే 1800 425 1980, 97019 99645 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించేలా అవగాహన కల్పించాలన్నారు. బల్దియా కార్యాలయంలో రౌండ్ ది క్లాక్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 24 గంటల పాటు సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. తాగునీరు కలుషితమవకుండా నిత్యం పర్యవేక్షించాలని నిర్ణయించారు. ప్రధాన రహదారుల్లో వరద నీరు నిల్వ ఉండే వరంగల్‌లో 10 ప్రాంతాలను హనుమకొండలో 12 ప్రాంతాలను గుర్తించినట్లు పేర్కొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు..

డీఆర్ఎఫ్ విభాగం నుంచి 6 బోట్లు, లైఫ్ జాకెట్స్ 40, లైఫ్ బాయ్స్ 22తో పాటు 27 మంది సిబ్బంది 3 షిఫ్టుల్లో 24 గంటలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఫైర్ ఎక్విప్‌మెంట్‌తో ఎలాంటి విపత్తు సంభవించినా అందుబాటులో ఉంటారన్నారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. బల్దియా పరిధిలో శిథిల భవనాలకు మరోమారు నోటీసులు జారీ చేసి కూల్చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అడిషనల్ కమిషనర్ జోనా, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, ఇన్‌చార్జ్ ఎస్ఈ, మహేందర్, సిటీప్లానర్లు రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఎంహెచ్ఓ రాజేశ్, హెచ్ఓ రమేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమం

వరంగల్: దేశ ప్రయోజనాలు, ప్రతిష్టను అమెరికాకు తాకట్టు పెడుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలపై ఉద్యమించాలని ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీఉల్లా ఖాద్రీ పిలుపునిచ్చారు. 2న నిర్వహించనున్న చలో అమెరికా రాయబార కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. ఎల్‌బీనగర్‌లోని సోమవారం నిర్వహించిన సమావేశంలో ముట్టడి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

మహాసభను విజయవంతం చేయాలి

హసన్‌పర్తి: ఈ నెల 4వ తేదీన కాజీపేటలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించతలపెట్టిన 3వ గొర్రెలు, మేకల పెంపకదారుల మహాసభను విజయవంతం చేయాలని యాదవ విద్యావంతుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దాసరి కోటేశ్వర్ పిలుపునిచ్చారు. జిల్లా మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ హసన్‌పర్తి మండలంలోని పలు గ్రామాల్లో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు.

చిన్నచూపు చూస్తే ఊరుకోం..

నయీంనగర్: సమస్యలపై సంఘటితంగా పోరాడుదామని, డిజిటల్ మీడియా అని చిన్నచూపు చూస్తే ఊరుకునేది లేదని వరంగల్ డిజిటల్ మీడియా ఎడిటర్లు అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఓరుగల్లు డిజిటల్ మీడియా ఎడిటర్ల సమావేశం వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. అనంతరం ఓరుగల్లు డిజిటల్ మీడియా ఎడిటర్స్ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం సలహాదారులుగా నేటిధాత్రి ఎడిటర్ కట్ట రాఘవేందర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజును ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా గడ్డం కేశవమూర్తి, ఉపాధ్యక్షులుగా చేలిక రాజేంద్రప్రసాద్, పల్లె రవివంశీమోహన్, బొల్లెపల్లి కిషన్, ప్రధాన కార్యదర్శిగా వేముల రాజేశ్వర్ రావు, సహాయ కార్యదర్శులుగా దామెర రాజేందర్, సుంకరనేని నర్సయ్య, బాలాజీ, సాంస్కృతిక కార్యదర్శిగా యాంసాని శ్రీనివాస్, కోశాధికారిగా కొడగాని మోహన్ రావు, మీడియా ఇన్‌చార్జ్‌గా నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా రావుల రాజేశం, కృష్ణ, ప్రభాకర్‌రావు, వెంకటస్వామి, మధుసూదన్, రాజు, జనార్దన్, కిరణ్, రాజిరెడ్డిని ఎన్నుకున్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో 72గంటల బంద్

విద్యారణ్యపురి: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో ఈనెల 2, 3, 4వ తేదీల్లో కళాశాలల (డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్స్ కోర్సులు) 72గంటల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ తెలిపారు.

విద్యాసంస్థల బంద్ పోస్టర్ ఆవిష్కరణ

విద్యారణ్యపురి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని, విద్యారంగం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జార్జిరెడ్డి పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4వ తేదీల్లో నిర్వహించనున్న 48 గంటల విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుర్గం సారయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు.

4న సెలూన్ షాపులు బంద్

హన్మకొండ చౌరస్తా: పెరిగిన ముడి సరుకులకు అనుగుణంగా హెయిర్ కట్, షేవింగ్ ఇతర ధరలను పెంచుతున్నట్లు కృషి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం హనుమకొండ చౌరస్తా కమిటీ అధ్యక్షుడు సింగారపు శ్యామ్ తెలిపారు. 4న హనుమకొండ పట్టణ సెలూన్ల బంద్ పాటిస్తున్నట్లు తెలిపారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

రామన్నపేట: కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఈనెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు వ్యాపారులు, గుమస్తాలు సంపూర్ణ మద్దతు ప్రకటించి విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అరూరి కుమార్ పిలుపునిచ్చారు.

కొండా సురేఖ శాసన సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

వరంగల్ చౌరస్తా: గత 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా కొండా సురేఖ పోటీ చేసిన క్రమంలో ఎన్నికల ఖర్చు కోసం 16 ఎకరాల భూమి అమ్మగా వచ్చిన రూ.70 కోట్ల సొమ్ము వెచ్చించినట్లు ఆమె భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు బాహాటంగా వెల్లడించారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల అధికారులు విచారణ చేపట్టి సురేఖ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు.

గుండె జబ్బుల నిర్ధారణలో ఈసీజీ కీలకం

కాజీపేట అర్బన్: గుండె జబ్బుల నిర్ధారణలో ఈసీజీ కీలకంగా వ్యవహరిస్తుందని మెడికవర్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. హంటర్ రోడ్డులోని కన్వెన్షన్ హాల్‌లో మెడికవర్ ఆస్పత్రి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో సోమవారం ఏర్పాటు చేసిన ఈసీజీపై అవగాహన సదస్సులో మెడికవర్ గుండె వైద్య నిపుణులు మాట్లాడారు. ఛాతిలో నొప్పి, మంట వంటి సమస్యలు తలెత్తినప్పుడు తప్పకుండా ఈసీజీ తీసుకోవాలని సూచించారు.

కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణంపై కేంద్రంపై ఒత్తిడి

హన్మకొండ: రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం, పనుల్లో వేగం పెరిగేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా పార్టీ పరంగా పోరాడాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. హైదరాబాద్‌లో ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో సమావేశమయ్యారు.

గుడిసెవాసులకు పట్టాలివ్వాలి

న్యూశాయంపేట: ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కే.భిక్షపతి డిమాండ్ చేశారు. హనుమకొండ పార్టీ కార్యాలయంలో ఉత్తర మండల 2వ మహాసభ గుంటి రాజేందర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. అనంతరం నూతన ఉత్తర మండల కమిటీని ఎన్నుకున్నారు.

రైల్వే ఎలక్ట్రిక్ షెడ్ సీనియర్ డీఈఈలకు సన్మానం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో సీనియర్ డీఈఈగా పనిచేసి సికింద్రాబాద్‌కు బదిలీపై వెళ్తున్న ప్రశాంత్‌కృష్ణసాయిని, గుంటూరు డివిజన్ నుంచి బదిలీపై వచ్చి సీనియర్ డీఈఈగా బాధ్యతలు స్వీకరించిన జి.సూర్యనారాయణను కాజీపేట రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ కమిటీ పాలక వర్గ సభ్యులు సోమవారం సన్మానించారు.

నాలుగుసార్లు హాజరు విధానాన్ని ఎత్తివేయాలి

న్యూశాయంపేట: కార్పొరేషన్‌కు ఆదాయాన్ని పెంచే వివిధ విభాగాలకు చెందిన మున్సిపల్ కార్మికుల శ్రమను అధికారులు అవమాన పరుస్తున్నారని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) హనుమకొండ, వరంగల్ జిల్లా కమిటీ నాయకులు అన్నారు.

ఉద్యమకారుల శాంతి దీక్ష

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలో ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం శాంతి దీక్ష చేపట్టారు. దీక్ష శిబిరాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, ఆత్మ మాజీ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్ సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

ముదిరాజ్‌లను ఎదగనివ్వరా?

హన్మకొండ: నాడు పండుగ సాయన్న పౌరుషాన్ని అణగదొక్కారని, ఎర్ర సత్యం రాజకీయాన్ని తుదముట్టించారని, ఇప్పుడిప్పుడే ఎంతోకొంత అవగాహనకు వస్తున్న ముదిరాజ్‌లను అన్ని పార్టీలు ఆర్థికంగా రాజకీయంగా ఎదగనివ్వకుండా చేస్తున్నాయనేది నేటి బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలో స్పష్టంగా తేటతెల్లమైందని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

స్కంద పంచమి వేడుకలు

కాజీపేట: స్వయంభూ శ్వేతార్క మూలగణపతి ఆవరణలోని వల్లిదేవ సమేత సుబ్రహ్మణ్య స్వామికి సోమవారం స్కంద పంచమి వేడుకలు నిర్వహించారు. దేవతామూర్తులకు అర్చకులు విశేష అభిషేక క్రతువును జరిపించారు.

దర్గాను ఢీకొట్టిన లారీ

న్యూశాయంపేట: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న సమాధుల (దర్గా)ను సోమవారం తెల్లవారుజామున ఓ లారీ ఢీకొట్టింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'క్రిమిసంహారక మందుల' విక్రేత అరెస్ట్

న్యూశాయంపేట / వరంగల్ చౌరస్తా: గడువు ముగిసిన క్రిమిసంహారక మందుల విక్రేతను టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఏజే మిల్స్‌కాలనీ పరిధిలోని బాలాజీ ఆగ్రో ఏజెన్సీలో దాడులు చేసి కే.రమేష్‌ను అరెస్ట్ చేసి, రూ.38,267 విలువైన పురుగు మందులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపులో బైక్ చోరీల నిందితులు

రామన్నపేట: బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగురిని అరెస్టు చేసినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. పోచమ్మమైదాన్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో మహ్మద్ సిద్ధిఖ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న మరో షేక్ ఫిరోజ్, షేక్ షాయాబాస్‌ను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఐదు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.